సాక్షి శ్రీకాకుళం

మంగళవారం, 1, జూలై, 2025



సమస్యలు పరిష్కరించాలి

గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజలు సమస్యలు ఏకరవు పెట్టారు. అధికారులు వినతులు స్వీకరించారు.

- 8లో



షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

పొందూరులో ఓ ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోయింది. షార్ట్ సర్క్యూటే కారణం.

- 8లో

శ్రీముఖలింగం ఈఓగా వాసుదేవరావు



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయ కార్యనిర్వహణ అధికారిగా టి.వాసుదేవరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ప్రభాకరరావు పదవీ విరమణ చేయగా పాతపట్నం నీలమణి అమ్మవారి ఆలయ ఈఓగా పనిచేస్తున్న వాసుదేవరావు శ్రీముఖలింగంలో అదనపు బాధ్యతలు చేపట్టారు.

న్యూస్‌రీల్

వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలకు ముగిసిన కౌన్సెలింగ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌ను శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్ పర్యవేక్షణలో నిర్వహించారు. సిఫార్సు లేఖలతోనే బదిలీలన్నీ జరగడం గమనార్హం. ఈ బదిలీల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు అవకాశం కల్పించగా, మొదట విభిన్న ప్రతిభావంతులు, స్పౌజ్ కేటగిరీకి చెందిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థుల నుంచి ఇప్పటికే తీసుకున్న ఆప్షన్లు, ఖాళీల ఆధారంగా సీనియారిటీ పద్ధతిలో ఎంపికలు చేస్తామని తెలిపారు. అంతే కాకుండా మీకు ఫలానాచోట నియామకం కల్పిస్తామని హామీ ఇవ్వకుండానే, ఆప్షన్లు తీసుకొని పంపించేశారు. ఈ బదిలీలపై వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి జిల్లా మొత్తం 350 మందికి బదిలీల కౌన్సెలింగ్ చేపట్టినట్లు డీడీ తెలిపారు.

హొన్నాళి పాఠశాల సందర్శన



హొన్నాళి గ్రామ పాఠశాలను సందర్శించిన డీఈఓ తిరుమల చైతన్య

మందస: జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య సోమవారం మందస మండలం హొన్నాళి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి బడిని పరిరక్షించాలని, 6, 7, 8 తరగతుల పిల్లలు సుమారు 5 కిలోమీటర్లు ప్రయాణం చేసి పక్క బడికి వెళ్లడం కష్టమవుతుందని వివరించారు. యూటీఎఫ్ నాయకులు కూడా డీఈఓను కలిసి ఈ మేరకు విన్నవించారు.

గోవుల అక్రమ రవాణాపై కేసు నమోదు



అక్రమంగా గోవులను తరలిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని సరుబుజ్జిలి జంక్షన్ వద్ద ప్రధాన రహదారిలో తరలిస్తున్న గోవుల అక్రమ రవాణాకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ బి.హైమావతి తెలిపారు. ఆదివారం రాత్రి సరుబుజ్జిలి నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా బొలేరో పికప్ వాహనంలో గోవులను గుర్తించినట్లు తెలిపారు. వాహనంలో ఉన్న కొండంగి కృష్ణ, పుచ్చ లక్ష్మణరావు, ఒనము వెంకట తిరుపతి అనే వ్యక్తులను విచారించామన్నారు. వీరంతా కలిసి రుగడ ప్రాంతం నుంచి విజయనగరం జిల్లా అలమండకు కబేళాకు తరలిస్తున్నట్లు తెలిసిందని, దీంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి బండిని సీజ్ చేశామని చెప్పారు.

'సమాన పనికి సమాన వేతనం కల్పించాలి'

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చట్టప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆర్టీసీ శ్రీకాకుళం-1, 2 డిపోలతో పాటు టెక్కలి, పలాస డిపోలలో ఔట్ సోర్సింగ్ కార్మికులు దాదాపుగా 220 మంది పని చేస్తున్నారన్నారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాల పంపిణీలో న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీపీటీడీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి కిరణ్, కార్యదర్శి పి.సంతోష్, జిల్లా కోశాధికారి ఆర్.నవీన్‌కుమార్, సభ్యులు రామ్మోహన్, శివ, శ్యాం, నరసింహ, రాజారావు, వేణుగోపాల్, వెంకట్, పార్వతమ్మ, సావిత్రి, ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఒడుపుగా.. చేపట్టగా

ఆదివారం పొద్దుటి పూట సావళ్లతో కంచానికి భలే స్నేహం కుదురుతుంది. బుధవారం మధ్యాహ్నం పూట నెత్తళ్లతో నేస్తరికం అదిరిపోతుంది. అదే రోజు రాత్రికి ట్యూనా ఉంటే భేషుగ్గా బ్రేమ్మనిపించవచ్చు. ఉప్పుచేప.. పప్పుచారు అని పెద్దలు ఊరికే అనలేదు మరి. ఉప్పు చేప ఏ పూటకు వండినా అమోఘమే. అందుకే జిల్లా నుంచి ఏటా రూ.4.5 కోట్ల విలువైన ఉప్పుచేపలు ఎగుమతి అవుతున్నాయి. మాంసంపై సవాలక్ష మీమాంసలు ఉండడంతో చేపలతో జిహ్వా చాపల్యాన్ని తగ్గించుకుంటున్నారు.





మంచినీళ్లపేట తీరంలో ఇసుక దిబ్బలపై ఎండబెడుతున్న చేపలు

- ఉప్పు చేపకు పెరుగుతున్న ఆదరణ
- జిల్లా నుంచి ఏడాదికి 397 టన్నుల ఎగుమతి
- కోళ్ల ఫారాలకు విక్రయాలు
- ఏడాదికి రూ.4.50 కోట్లు వ్యాపారం
- ట్యూనా, కవ్వళ్లు, నెత్తళ్లు, మొరవలు, సావళ్లకు డిమాండ్

వజ్రపుకొత్తూరు:

మన ఉప్పు చేపను ఉత్తరాది వాసులు లొట్టలేసుకుని మరీ తింటున్నారు. జిల్లాలో ఉప్పు చేపల టర్నోవర్ రూ.కోట్లలో ఉంటోంది. సాధారణంగా దక్షిణాదిన ప్రతి ఇంటా ఉప్పు చేప కచ్చితంగా ఉంటుంది. ఇప్పుడు ఉత్తరాది వారికి కూడా ఈ రుచి తెలిసింది. అందుకే తెగకొంటున్నారు. ఇటు కేరళలో అయితే ట్యూనా చేపకు మంచి డిమాండ్ ఉంది. కిలో రూ.600 వరకు పలుకుతుండగా పండుగప్ప చేప రూ. 800 వరకు పలుకుతోందని కేరళకు చెందిన చేపల వ్యాపారి ప్రభానంద్ తెలిపారు. మన ప్రాంతంలో ఎండు నెత్తళ్లకు గిరాకీ ఎక్కువ. కిలో రూ.500లకు విక్రయాలు చేపడుతున్నారు.

బరంపురం, బారువ, నువ్వలరేవు, మంచినీళ్లపేట, బావనపాడు, బుడగట్ల పాలేం, రణస్థలం, ఎచ్చెర్ల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారం సాగుతోంది. తినడానికి పనికి రాని కవ్వళ్లు, కారలు, ఇతర ఉప్పు చేపలను బ్రాయిలర్స్, లేయర్స్ పెంచే కోళ్ల ఫారాల యజమానులు కొనుగోలు చేసి కోళ్ల మేత కోసం అమ్మకాలు చేస్తున్నారు. ఇదికాక సందువ, పండుగప్ప, ట్యూనా, నెత్తళ్లు, మొరవలు, సావళ్లు, కానాగత్తలు వంటి తినేందుకు పనికి వచ్చే ఉప్పు చేపలను కేరళ, బీహార్, తెలంగాణ, మధ్య ప్రదేశ్‌తో పాటు ఉత్తరాది నగరాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. దీంతో అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు రణస్థలం వరకు ఏడాదికి 397 టన్నుల ఉప్పు చేపలు ప్రాసెస్ చేస్తుండగా సుమారు రూ.4.50 కోట్ల వ్యాపారం జరుగుతోంది.



ఎండిన కవ్వళ్లు

పోషకాలు మెండు

ఉప్పు, ఎండు చేపల్లో పోషకాలు మెండుగా ఉంటాయి. సంపూర్ణ ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఒమేగా-3 ఫాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి మెదడు పనితీరు మెరుగుపరచడమే కాకుండా వాపు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. విటమిన్-ఎ, బి12, డి అధికంగా ఉంటాయి. వాసన కాస్త భరించగలిగితే ఎండు ఉప్పు చేపల్లో బోలెడు ప్రయోజనాలు ఉన్నాయి.

ఇసుక దిబ్బలే ప్లాట్‌ఫారాలు

చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ఒక్కోసారి పెద్ద ఎత్తున కవ్వళ్లు, ట్యూనా, నెత్తళ్లు, మొరవలు, కానాగడతలు, కారలు, చిదుములు తదితర చేపలు దొరుకుతాయి. ఆ సమయంలో మార్కెట్ లేక టబ్బుల్లో నానబెట్టి ఉప్పు పట్టించి ఎండు చేపలుగా తయారు చేస్తారు. ఆ సమయంలో చేపలు ఎండేందుకు ఇసుక దిబ్బలనే ప్లాట్‌ఫారాలుగా ఉపయోగపడుతున్నాయి. ఇదికాక కేవలం ఎండు చేపల తయారీ కోసమే చేపల వేట సాగించి వాటిని తయారు చేస్తున్నారు. బారువ, మంచినీళ్లపేట, నువ్వలరేవు, భావనపాడు తీరాల్లో ఎక్కువగా ఉప్పు చేపల తయారీ చేపడుతున్నారు. ఈ ప్రాంతాల్లోనే దాదాపు ఏడాదికి 150 టన్నుల వరకు ఎండు చేపలను తయారు చేస్తారు. వీరికి సరైన ప్లాట్‌ఫారాలు, మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఉప్పు చేపల ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంది.



ఉప్పు చేపలు ప్రాసెస్ చేసేందుకు వాడుతున్న టబ్బులు

మా ప్రాంతంలో ఎక్కువగా ఎగుమతి చేస్తాం



మంచినీళ్లపేట, నువ్వలరేవు ప్రాంతాల నుంచి అధికంగా ఎండు చేపలను ఉప్పు పెట్టి ఉత్పత్తి చేస్తాం. మేము వేటకు వెళ్లే సమయంలో అధికంగా చేపలు పడితే వాటిని పాడు చేసుకోకుండా ఉప్పు పెట్టి ఎండబెడతాం. ఈ ఏడాది ఎండు చేపలు పెద్ద మొత్తంలో విక్రయాలు జరిగాయి. సాధారణ ఎండు చేపలైతే కిలో రూ.200 పైమాటే. ట్యూనా, నెత్తళ్లు, పండుగప్ప, సందువ చేపలైతే రూ.400 నుంచి రూ.800 వరకు ధర పలుకుతాయి.

– కె.రాములమ్మ, మంచినీళ్లపేట

హోటళ్లలోనూ ఆర్డర్ ఇస్తున్నారు



ఉప్పు చేపలు తినే వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో పచ్చి చేపలకే ప్రాధాన్యత ఇచ్చే నాన్‌వెజ్ ప్రియులు ఇపుడు ఉప్పు చేప ఉందా అని మా హోటల్‌కు వచ్చి అడుగుతున్నారు. వైజాగ్, తమిళనాడు, బరంపురం లాంటి సిటీ హోటళ్లలో ప్రత్యేకంగా ఎండు చేపలు డిష్‌లు ఉంటాయి. వాసన మాట అటుంచి తింటే ఆరోగ్యం చక్కగా ఉంటుందని నా నమ్మకం. నేను అప్పుడప్పుడూ ఎండు చేపలు తింటాను. – ఎం.జయలక్ష్మి, హోటల్ సర్వర్, పలాస

ఆరోగ్యానికి మంచిది



ఎండు చేపలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ప్రోటీన్లు, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్‌లు, విటమిన్‌లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఒమేగా-3 ఫాటీ ఆమ్లాలు ఎండు చేపల్లో అధికం. మెదడు పనితీరు మెరుగుపడడంతో పాటు మంచి చేసే కొలెస్ట్రాల్లు ఉన్నాయి. చక్కటి ఆరోగ్యానికి ఎండు చేపలు ఎంతో మేలు చేస్తాయనడంలో సందేహం. ప్రతి ఒక్కరూ దీన్ని మితంగా తీసుకుంటే ఆరోగ్యం లభిస్తుంది.

– డాక్టర్ కె.లీల, విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

బాబును బతికించండి

- కన్నపేగు కోసం తల్లిదండ్రుల అభ్యర్థన
- హైడ్రో సెఫలెస్ ఇన్‌ఫెక్షన్‌తో బాధ పడుతున్న చిన్నారి
- శస్త్ర చికిత్సకు రూ.20లక్షలు అవసరమవుతున్న వైనం
- దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు

ఇచ్ఛాపురం రూరల్: ఆ బాబు వయసు పది నెలలు. నవ్వితే నిండు చందమామలా ముద్దుగా ఉంటాడు. తండ్రి పెయింటింగ్ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉన్నట్టుండి ఈ బాలుడికి అనారోగ్యం చేసింది. చూస్తుండగానే అది ప్రాణాంతకంగా మారిపోయింది. ఇప్పుడు బాబు బతకాలంటే రూ.20 లక్షలు ఖర్చు పెట్టి శస్త్ర చికిత్స చేయించాలి. పెయింటింగ్ పనికి వెళ్తే గానీ కుటుంబం కడుపు నిండని పరిస్థితుల్లో అంత డబ్బు తీసుకురావడం ఆ తల్లిదండ్రులకు తలకుమించిన భారమవుతోంది. బాబును బతికించుకోవడానికి వారు దాతల సాయం కోరుతున్నారు.

ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి పురుషోత్తం, శాంతిలకు ఆడపిల్ల పుట్టిన తర్వాత రెండో సంతానం రియాన్. మూడు నెలలు కిందట బాబుకు హై ఫీవర్ రావడంతో స్థానిక ఆస్పత్రిలో చూపించారు. బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో పాటు ఫిట్స్ రావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ పట్నంలో చేర్పించారు. 15 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచిన వైద్యులు పసివాడి మెదడులో ద్రవం చేరడంతో 'హైడ్రో సెఫెలెస్ ఇన్‌ఫెక్షన్'కు గురయ్యాడని, శస్త్ర చికిత్స చేయాలంటూ చెప్పడంతో ఆరోగ్యశ్రీ ద్వారా తొలిసారి ఆపరేషన్ చేశారు. అప్పటికే లక్ష రూపాయల వరకు ఖర్చయింది. రెండు నెలలు తర్వాత బాబు తల రోజురోజుకూ పెరగడంతో మళ్లీ విశాఖ ఆస్పత్రిలో చేర్పించగా వెంటనే తిరుపతి స్విమ్స్‌కు లేదా హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలంటూ వైద్యులు సూచించారు. తిరుపతిలో పరీక్షించిన వైద్యులు వెంటనే శస్త్ర చికిత్స చేయాలని, అందుకు సుమారు రూ.20 లక్షలు వరకు ఖర్చవుతుందని చెప్పడంతో తల్లిదండ్రులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఇప్పటికే ఎస్‌జీఎఫ్ సంస్థ, కాళీమాత సేవా సమితి, పూర్వ విద్యార్థులు కలసి రూ.50వేలు వరకు ఆర్థిక సాయం అందించడంతో తిరుపతి వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలంటూ ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సాయం చేయదలచుకున్న వారు 6304051247 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.



హైడ్రో సెఫెలెస్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న రియాన్



కుమారుడితో తల్లిదండ్రులు శాంతి, పురుషోత్తం

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అధికారం అండతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతి పరులపై అక్రమ కేసులు బనాయించడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం కూటమి ప్రభుత్వం చేస్తోందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వారి దౌర్జన్యాలు, అక్రమాలు ఇంకెన్నాళ్లో కొనసాగవని, వారికి తగిన బుద్ధి చెబుతామని అంతవరకు ధైర్యంగా ఉండాలని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. కోమర్తి సర్పంచ్ ఉంగటి చిన్నమ్ముడు, భర్త, అత్తల పేరున ఉన్న ఆస్తులను పోలీసు బందోబస్తుతో ధ్వంసం చేయడం తెలిసిందే. ఈ సమాచారాన్ని తెలుసుకున్న కృష్ణదాస్ సోమవారం ఉంగటి చిన్నమ్ముడు, ఆమె భర్త ఉంగటి రాజు, అత్త ఉంగటి అప్పమ్మలకు ధైర్యం చెప్పారు. మీకు పార్టీ అండగా ఉంటుందన్నారు. నరసన్నపేట మండలంలో చోడవరం, పారశిల్లి, చేనులవలస ఇలా పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆస్తులను ధ్వంసం చేశారని అన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయిన వెంటనే వీరందరికీ తగు విధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కృష్ణదాస్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బగ్గు రమణయ్య, కనపల శేఖరరావు బొబ్బాది ఈశ్వరరావు, యాబాజి రమేష్, కోల ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.



రెవెన్యూ సిబ్బంది కూల్చిన రేకు షెడ్‌ను చూపుతున్న సర్పంచ్ చిన్నమ్ముడు

సదరం సర్టిఫికెట్ల వ్యవహారంపై సీఐ ఆరా

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆర్థో స్పెషలిస్టుగా పనిచేసిన రవికిరణ్ జారీ చేసిన సదరం సర్టిఫికెట్లపై నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు తన కార్యాలయంలో ఆరా తీశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన శ్రీకాకుళంలో గతంలో డీసీహెచ్‌గా పనిచేసి ప్రస్తుతం రాజాం సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మితో సోమవారం మాట్లాడి వివరాలు సేకరించారు. నరసన్నపేట ఏరియా ఆస్పత్రిలో పలువురు అనర్హులకు వికలాంగత్వం ఉందని రవికిరణ్ సర్టిఫై చేయడం, దానికి ఆస్పత్రి కమిటీ సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం తెలిసిందే. ఈ సర్టిఫికెట్లపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లడం, ఆయన పరిశీలనకు ఆదేశించడం, అవి అక్రమమని నిర్ధారణ కావడం విధితమే. దీనిపై ఆర్థో స్పెషలిస్టు రవికిరణ్‌తో పాటు కమిటీలో ఉన్న వైద్యులకు వైద్య శాఖ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఏప్రిల్ 30న నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి గతంలో డీసీహెచ్‌గా పనిచేసిన రాజ్యలక్ష్మి నుంచి కొంత సమాచారాన్ని సేకరించారు. ఎంత మంది అనర్హులకు సర్టిఫికెట్లు ఇచ్చారో అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ఈ కేసు దర్యాప్తులో ఉందని మరిన్ని వివరాల కోసం రాజ్యలక్ష్మితో మాట్లాడామని అన్నారు.



సీఐతో మాట్లాడుతున్న డాక్టర్ రాజ్యలక్ష్మి, ఏఓ తదితరులు

పాఠశాల తరలించవద్దు ప్లీజ్



పాఠశాలలో 3, 4, 5 తరగతులను వేరే పాఠశాలకు తరలించవద్దంటూ నందివాడ పంచాయతీ భగవాన్‌దాసుపేట ఎంపీపీఎస్‌లో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం పాఠశాల ముందు నిరసన తెలిపారు. పాఠశాలలో 3, 4, 5 తరగతులను అధికారులు నరసాపురం మోడల్ ప్రైమరీ పాఠశాలకు తరలించారు. దీనిపై గతంలోనూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా పాఠశాలలో తరగతులు తరలించడంతో హెచ్‌ఎం ఉండగానే పాఠశాలను ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. నిత్యం భారీ వాహనాలు తిరిగే రాష్ట్ర రహదారిపై నరసాపురం పాఠశాలకు విద్యార్థులు ఎలా వెళతారని తల్లిదండ్రులు ప్రశ్నించారు.

–పొందూరు

మహాశింగి పంచాయతీలో వయోవృద్ధులకు అందని రేషన్

సారవకోట: మండలంలోని మహాశింగి పంచాయతీలోని రేషన్ దుకాణం ద్వారా వయోవృద్ధులకు జూలై నెలకు రేషన్ సరుకులు అందలేదు. ప్రభుత్వం జూలైకు చెందిన రేషన్ సరుకులు జూన్ నెల చివరి నాటికే అందించాలని సూచించింది. ఈ పంచాయతీ పరిధిలో రేషన్ డిపోలో 501 రేషన్ కార్డులుండగా దాంట్లో 70 వయోవృద్ధులకు చెందిన కార్డులు ఉన్నాయి. అయితే ఈ 70 మంది వయోవృద్ధులకు రేషన్ సరుకులు ప్రభుత్వం సూచన మేరకు అందజేయలేదని పలువురు వృద్ధులు ఆరోపిస్తున్నారు. సోమవారం జూన్ చివరి రోజు కావడంతో రేషన్ సరుకులు అందజేయక పోవడంతో మంగళవారం నుంచి వయోవృద్ధులు రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుంది.

కింజరాపు ఏజెన్సీ ద్వారా మైనింగ్ దోపిడీ

- ధ్వజమెత్తిన పేరాడ తిలక్

టెక్కలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెక్కలి నియోజకవర్గంలో కింజరాపు ఏజెన్సీ ద్వారా పెద్ద ఎత్తున మైనింగ్ దోపిడీ జరుగుతోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆరోపించారు. సోమవారం టెక్కలిలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మైనింగ్ కార్యకలాపాల కోసం గతంలో విశ్వ సముద్ర, ఏఎంఆర్ సంస్థలు ఉండేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు సోదరుడు హరిప్రసాద్ నేతృత్వంలో కింజరాపు ఏజెన్సీగా మారిందన్నారు. టెక్కలి మండలంలోని గూడేం, అడ్డుకొండ, కోటబొమ్మాళి మండలంలోని అక్కయ్యవలస, కొత్తపేట, శ్రీజగన్నాథపురం, పొడుగుపాడు, చిన్నసాన, జర్జంగి, సంతబొమ్మాళి మండలంలోని నర్సాపురం, గోవిందపురం, సంతబొమ్మాళి, వెంకటాపురం, నందిగాం మండలంలోని తురకలకోట, సొంటినూరు, బెజ్జిపల్లి, కొండతెంబూరు తదితర ప్రాంతాల్లో మంత్రి అండదండలతో మైనింగ్ మాఫియా జరుగుతోందని దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న పేరాడ తిలక్

కక్ష సాధింపులు చేస్తున్నారు

అనుమతులు ఉన్న క్వారీలు, క్రషర్లు, ఫ్యాక్టరీలపై కక్ష సాధింపులు చేస్తూ, అనుమతులు లేని క్వారీలు, క్రషర్లు, ఫ్యాక్టరీలను నడిపించడానికి రాజస్థాన్‌కు చెందిన వ్యక్తికి అధ్యక్ష పదవి కట్టబెట్టారని మండిపడ్డారు. ప్రతి నెలా ఒక్కో క్వారీ నుంచి మంత్రి సోదరుడికి 4 గ్రానైట్ బ్లాకులు ఉచితంగా ఇస్తున్నారని, దీంతో అక్రమ మైనింగ్ చేసినా అధికారులు పట్టించుకోకుండా ఉండేవిధంగా డీల్ కుదుర్చుకున్నారని ధ్వజమెత్తారు. నందిగాం మండలంలోని కణితూరు గ్రామంలో శ్మశానవాటికకు విద్యుత్ సదుపాయం కల్పించే విషయంలో సైతం అధికారులతో మంత్రి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం విడ్డూరంగా ఉందన్నారు. తన ఆరోపణల్లో ఎక్కడైనా అవాస్తవం ఉందని నిరూపిస్తే దేనికైనా సిద్ధంగా ఉన్నానని తిలక్ సవాల్ విసిరారు. మూలపేట పోర్టు సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

రోడ్డుపై మొరాయించిన ఇసుక లారీ



పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధిలోని పార్వతీశం పేట మలుపు వద్ద ఆలికాం-బత్తిలి సీఎస్‌పీ రోడ్డుపై ఇసుక లారీ దిగబడింది. ఈ నేపథ్యంలో సోమవారం వేకువజాము నుంచి అటు వైపుగా వెళ్లిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమై గుంతలు ఏర్పడడంతో అధిక లోడులతో వచ్చే వాహనాలు దిగబడిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీ దిగబడిపోవడంతో ఆలికాం బత్తిలి రోడ్ నుంచి పాలకొండ రోడ్డు వైపు వెళ్లే వాహనాలు పట్టణం గుండా వెళ్లాల్సి వచ్చింది.

– ఆమదాలవలస

కూటమి పాలన కార్పొరేట్లకు వరం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): టీడీపీ కూటమి ఏడాది పాలన కార్పొరేట్లకు వరం, ప్రజలపై భారం అన్నట్లుగా ఉందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో దారి తప్పుతున్న టీడీపీ కూటమి ఏడాది పాలన పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తలకిందులుగా జరుగుతోందన్నారు. ప్రజలకు హామీలు, వాగ్దానాలు, మాటలే మిగిలాయని, కార్పొరేట్లకు కారు చౌకగా భూములు కట్టబెడుతున్నారని దుమ్మెత్తిపోశారు. సూపర్ -6తో సహా హామీల వైఫల్యం, విద్యుత్, పన్నుల భారాలు, గిట్టుబాటు ధరలేకపోవడం, కనీస వేతనాలు అమలు కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని, జీడికి గిట్టుబాటు ధర ఇచ్చి బోర్డు ఏర్పాటు చేస్తామన్న వాగ్దానం అమలు జరగలేదన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పడంతో పాటు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని విమర్శించారు. శ్రీకాకుళం నగరంలో ఉన్న మున్సిపల్ కార్యాలయం, పెద్ద మార్కెట్, బాపూజీ కళా మందిర్, నగరంలో ఉన్న ఐదు పార్కులు, జిల్లా కేంద్ర గ్రంథాలయం మొదలగు ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోనారి మోహనరావు, పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పలాసలోని పీజీఆర్ఎస్‌లో 120 వినతుల స్వీకరణ


పలాస: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీడి రైతాంగ కమిటీ ప్రతినిధులు

పలాస: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీదారుల వినతులను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్నటువంటి ఉప ఖజానా కార్యాలయంలో ప్రజా సమస్యల నమోదు, పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 120 వినతులు స్వీకరించారు. దీనిలో ముఖ్యంగా పింఛన్లు, భూ సమస్యలు, రోడ్లు, డీ–పట్టా భూములు, మంచినీరు, గృహ నిర్మాణాలు, సదరం, రేషన్‌కార్డులు వంటి సమస్యలపై ఫిర్యాదులు ఉన్నాయి.

వైద్యులను నియమించాలి

కాశీబుగ్గలో గత ప్రభుత్వంలో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని ఉద్దానం ఆరోగ్య పరిరక్షణ కమిటీ ప్రతినిధులు విన్నవించారు. ప్రతిరోజూ ఉద్దానం ప్రాంతం నుంచి రోజుకు కనీసం 60 మందికి తగ్గకుండా డయాలసిస్ చేయించుకోవడానికి వస్తున్నారని, అందుకే డయాలసిస్ యూనిట్లను పెంచాలని విన్నవించారు. అలాగే సీరం క్రియేటిన్ 3 దాటిన వారికి కనీసం రూ.5 వేలు ఫించను ఇవ్వాలని, ఆస్పత్రిలో రోగులకు ఉచిత భోజన సదుపాయం కల్పించాలని కోరారు. అదేవిధంగా తమకు సంబంధించిన జిరాయితీ భూమిని పలాస పెద్దవీధికి చెందిన టీడీపీ కౌన్సిలర్ భర్త కృష్ణనాయక్, అతని బంధువులు పొందర త్రిలోచన, పొందర బలరాం, పొందర ప్రభాపాత్రో తదితరులు ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని పలాసలోని ఉదయపురం గ్రామానికి చెందిన రాజాం ఆదమ్మ, ఆమె కుమారులు గణపతి, సురేష్, రవి, గిరి, మురళి తదితరులు వినతిపత్రం అందజేశారు. ఉద్దానం ప్రాంత జీడి పిక్కలకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలని జీడి రైతాంగ కమిటీ ప్రతినిధులు కోరారు. నందిగాం మండలం కణితూరు శ్మశానవాటికకు విద్యుత్ లైన్ ఏర్పాటు విషయంలో టీడీపీ నాయకులు రాజకీయం చేస్తూ పనులు అడ్డుకుంటున్నారని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఫిర్యాదు చేశారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జెడ్పీ సీఈవో ఎల్.శ్రీధర్‌రాజు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ సుధాకర్, పలాస ఆర్డీవో జి.వెంకటేష్, డీఎంఅండ్‌హెచ్‌వో కల్యాణబాబు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవిత, పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి


శ్రీకాకుళం పాతబస్టాండ్: వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో వేంకటేశ్వరరావు


పలాస: వినతిపత్రం అందజేస్తున్న ఉద్దానం ఆరోగ్య పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీల పరిష్కారానికి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి సంబంధిత అర్జీదారుని వద్దకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి మాట్లాడి వారికి నాణ్యమైన సమాచారం అందజేయాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఏపీఈపీడీసీఎల్, సర్వే, భూగర్భ గనులు, ఇరిగేషన్, తదితర శాఖల సమస్యలపై 217 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి


వృద్ధుడి మృతదేహం

కంచిలి: మండల కేంద్రంలోని సోంపేట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో గుర్తు తెలియని 60 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. రైల్వేస్టేషన్‌లో 2, 3 ప్లాట్‌ఫారంల మధ్యలో వృద్ధుని మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు సోమవారం గుర్తించారు. మృతుడు పసుపు రంగు చొక్కా, దానిపైన నీలం రంగు గీతలు ఉన్నాయి. నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రాథమిక పరిశీలనలో సహజ మరణంగా జీఆర్పీ పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడిని గుర్తించేందుకు పలాస గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ షరీఫ్ కేసు నమోదు చేశారు. సమాచారం తెలిస్తే 94406 27567 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 63 ఫిర్యాదులు



ఎస్పీ కార్యాలయం ముందు దివ్యాంగుడు దామోదరరావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో అర్జీదారుల నుంచి 63 ఫిర్యాదులందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు. ఎచ్చెర్ల మండలం కొంగరాం గ్రామానికి చెందిన నక్క దామోదరరావు అదే గ్రామానికి చెందిన కొంతమందిపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గత నెల 16న తమ పొలంలోకి ట్రాక్టరు ఎందుకు తెచ్చారని తన కుటుంబీకులు అడిగినందుకు దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారన్నారు. రిమ్స్‌లో చికిత్స సైతం పొందామని, ఇదే విషయమై ఎచ్చెర్ల ఎస్ఐను సంప్రదించామని, న్యాయం చేయలేదు సరికదా ఎఫ్ఐఆర్ తమపై నమోదు చేశారని వాపోయారు. స్టేషన్‌లో దివ్యాంగుడైన తనను కాళ్లతో తన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయమై ఎచ్చెర్ల ఎస్ఐ వద్ద ప్రస్తావించగా అవతలి వ్యక్తులపై కేసు నమోదు చేశామని, తనపై ఆరోపణలుంటే రుజువు చేసుకోవాలన్నారు.







లోక్ అదాలత్ విజయవంతం చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూలై 5వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ స్థానిక జిల్లా కోర్టు భవనంలో ఇన్సూరెన్స్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీలతో సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీలు ఇరువురు ఒకచోట కూర్చుని ఇరువురికీ న్యాయం చేకూర్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, 3వ అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణి కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి


ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తోందన్నారు. అలాగే సర్పంచ్‌లకు తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింపచేయాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో ఎచ్చెర్ల మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శంకరరావు, బి.సాయిరాం, సనపల నారాయణరావు, బి.సాయి తదితరులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొందూరు: మండల కేంద్రంలోని అఫీషియల్ కాలనీలో జె.రాంప్రసాద్ ఇంట్లో ఆదివారం రాత్రి 11.00 గంటల సమయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చేలరేగాయి. కుటుంబ సభ్యులు ప్రమాదాన్ని గుర్తించి అప్రమత్తమై బయటకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.లక్ష విలువ చేసే ఫ్రిజ్, టీవీ, కుక్కర్, గ్రైండర్ కరెంటు సామానులు, వైరింగ్ కాలిపోయింది.